


అప్పుడే ప్రేమించడం మొదలుపెట్టిన అబ్బాయి మనసులో భావాల్లాగా, ఒక్కసారి సినిమా హాల్లో 'క్యూ' పెరిగిపోయింది.

'క్యూ' లో అందరిమొహాల్లోనూ—ఆరో ఏడో అక్షరిచ్చి, ఆ హాలు కట్టించినప్రొప్రైటరుగారి మనసులో ఆశంత విసుగుంది. అందరిమనసుల్లోనూ వాల్ పోస్టర్మీద హీరోయిన్ నవ్విన నవ్వుంది. అవసరమైతే 'బ్లాక్‌లోనైనా టిక్కెట్టు కొనొచ్చ'నే (?) ... 'క్యూరియాసిటీ'అందరిలోనూ వుంది. ఎందుకోకాని, వాళ్లందరికీ హీరోయిన్ బొమ్మ చూసేక 'హీరో' తనేనన్న భావం వుంది.

ఆ క్యూలో ముప్పైతొమ్మిదో హీరోగా నిలబడ్డ సుధాకరం సిగరెట్టు వెలిగించి ముందునున్నాయనతో "ఏమిటిసార్! ఇంత డిలే వా? టిక్కెట్లిచ్చేస్తే సొమ్మేంపోయింది? పైగా సొమ్మొస్తుంది. ఔనా సార్! రైటేనా? రెండుకిస్తానన్చెప్పి,రెండున్నరైంది కదా, ఇంకా టిక్కెట్లివ్వకపోవడమేమిటి చెప్పండి. కారణమడిగితే జవాబు చెప్పరు. చెప్పినా చెప్పవలసినటు చెప్పరు. ఏదో తగువైందంటారు. అందువల్ల షో డిలే ఐందంటారు...... మేనేజిమెంటు తెలిపోతే, మానెయ్యాలి....ఏమంటారు?" అని ఆగేడు.

అతనిముందు నిల్చున్నాయనకి నల్లటి వంటిరంగూ, హిట్లర్‌మీసం వున్నాయి. అపకతవగ్గా కుట్టిన పెర్లిన్ షర్టు జేబులో అయిదు రూపాయల నోట్లు చాలావున్నట్టున్నాయి. కళ్లలో ఎర్రనిపీరలున్నాయి. చేతిలో లంకపొగాకు చుట్టుంది. అతను సుధాకరంచెప్పిందంతా విని, చుట్ట నోట్లో పెట్టుకుని దాదాపు లుంగీలావున్న పంచెని మీదకు తోసుకుంటూ, లాయరు వాదన విని తలూసిన జడ్జీలా తలూపేడు.

అప్పుడు సుధాకరానికి చాలా కోపమొచ్చింది. ఆవాటం చూస్తే సంతపాలెం సరుకులావుంది. ఈబైతుకి మేనర్స్ "తెలీదుగాకతెలీదు." అనుకున్నాడతను. "ఇలాటి బ్రూట్స్‌ని బాల్కనీలోకసలు

విలో చేయకూడదు. ఛఛ్ అని కూడా అనుకుని, చుట్ట వాసన భరించలేక,సిగ రెట్టు వెలిగించేడు. 'క్యూ' లో చాలా మంది వాచీలు చూస్కుంటున్నారు. వాచీల్లేనివాళ్లు వాచీలున్న వాళ్లని టైమడిగేరు. "అప్పుడే మూడు దగ్గి రైందా?" అని ఆశ్చర్యపోయేరు. "హు" అని వేడిగా నిట్టూర్చేడు. చాలానిట్టూ ర్పులూ, చాలా సిగరెట్లపొగా కలియడంవల్ల అక్కడంతా వేడిగావుంది. విసుగ్గా వున్నప్పుడు, ఎంత చిన్నవిషయమైనా చాలా బాధకలిగిస్తుంది. కనక—అంత జోరుగా కాయని ఎండకూడా అతివేడిగా వున్నట్టుంది. అందువల్ల అక్కడంతా 'ఇన్‌టాలరబుల్' గానూ, ఇబ్బందిగానూ వుంది.... క్యూలో కొందరు అరుస్తున్నారు. మరికొందరు కూర్చొని వెధవజోకు లేస్తున్నారు. ఇంకా కొందరు ఇంకిపోయిన ఓపికతో ఇష్టంలేనట్టు వంగిపోయినిల బడివున్నారు. వాళ్లందరూ విసుగునీ, ఆశనీ కలిపి కళ్లల్లో వెలిగించుకుంటూ, ఆ కొత్త హాల్లో సినిమాదీపాల్లావున్నారు.

ఒక్కసారిగా సుధాకరానికి 'క్యూ'లోంచి బైటికెళ్లాలనిపించింది. ఆఖరి దమ్ము లాగి సిగరెట్టు పారేసేక, అతనికి సినీ మాలో హీరోయిన్నిచూసేక అడదాహం పట్టుకున్నట్టు, విసుగువల్లో మరెందు వల్లోగాని, చాలా దాహం వేసింది.గొంతు కలో ఏదో బాధ, మనసులో ఇంకా బోలెడు విసుగూ మొలకెత్తి, కలిసి పెరిగి పొంగేయతనిలో.

"ఒక్కమారు బైటికెళ్లొస్తాను. నాప్లేను కొంచెంచూస్తూంటారా సార్?" అని వెనుకనున్నాయన్ని అడిగేడు సుధాకరం.

వెనుకనున్నాయన సన్నగా నల్లగా ఇందాక పూర్తి ప్రాణంవుండి, ఇప్పుడే సగం ప్రాణం పోయినట్టున్నాడు. మరికొద్ది నిముషాల్లో టిక్కట్లివ్వకపోతే అతవా కొత్తహాలుకి బలైపోయేవాడిలా వున్నాడు. సుధాకరం మాటవిని అతను నీరసంగా తలూపేడు.

సుధాకరం బైటికొచ్చి వూపిరిపీల్చు కున్నాడు. ఎండలో అతనినీలం టెర్లిన్ చొక్కా విస్తృతమైన నీలిదీపపు కాంతిలా మెరుస్తోంది. అతని వాచీ అతని ఒంటిరంగు లాగే మెరుస్తోంది. అతని ఖరీదైన ఎంబాసిడర్ బూట్లజత ఖచ్చిత మైన కారుచీకటి ఖండంలాగేవుండి, సుధాకరం కాళ్లని కౌగలించుకుని ఖరీ దైన ప్రేమతో కరుస్తూ, మెరుస్తోంది.

ఇంతలో సడన్‌గా అనుకోకుండాఅతని కళ్లూ—రాదనుకున్న హీరోయిన్ వస్తే, ఆమెను చూసిన హీరో కళ్లలామెరిసేయి,

అందుక్కారణమైన "రత్నమాల" అతని క్కాస్త దూరంలో కేంటిన్‌కిబాగా దగ్గిరలో తెల్లని టెర్లిన్ చీరలో,తెల్లగా రత్నంలా మెరిసింది.

* * *

రత్నమాల ఎమ్మే చదువుతోంది. సుధా కరానికి, క్లాసంతటికీ రత్నమాలంటే చాలాఇష్టం. రత్నమాలతో బాటే 'ఎమ్మే ఎకనామిక్స్' చదువుతున్న సుధాకరం సాధార ణంగా క్లాసుకి మానకుండా వెళ్లడానికి గల అతిఅందమైన కారణం ఆఅమ్మాయి.

రత్నమాలెప్పుడూ టెర్లిన్ చీరలేకడు తుంది. ఎప్పుడూ మెళ్లో ఇమిటేషన్ రత్నాలమాల వేసుకొంటుంది. చాలాఅంద మైన అమ్మాయి. ఎంతందంగా నవ్వాలని రూలుందోఎప్పుడూ అలాటి అందమైన నవ్వులే నవ్వుతుంది. ఎప్పుడూ స్క్వేర్ వాచీనేకట్టుకుని, మాటిమాటికీ అవాచీ వైపే చూస్తూంటుంది. ఎప్పుడూఆ అమ్మాయి చాలా అందంగావుండి, 'అబ్బాయిలు కోరుకొనే అమ్మాయి'కి ఎగ్జాంపుల్‌గా వుంటుంది.

సుధాకరం రత్నమాలతో ఎప్పుడూ నోటితో మాట్లాడలేదు. కళ్లతోచాలా సార్లు మాట్లాడేడు.రత్నమాలకళ్లుచాలా నాజూగ్గా అందంగా వొంపులుతిరిగిమాట్లాడ గలవు. అందువల్ల సుధాకరానికి రత్న మాలకళ్లంటే చాలాఇష్టం. ఆమెకళ్లని చూస్తూంటే టెక్నికలర్ నీళ్లలో చాలా అందంగానూ గర్వంగానూ గెంతులు వేస్తున్న రెండు తోకల్లేని చేపలు గుర్తు కొస్తాయతనికి. రత్నమాల కళ్లక్కూడా సుధాకరం కళ్లంటే ఇష్టమేనని సుధాకరం కళ్లూ, మనసూ అనుకుంటాయి. ఎందు వల్లంటే రత్నమాలకళ్లు సుధాకరాన్ని చాలామార్లు పరీక్షగా చూసి నవ్వి సుధా కరం మనస్సుని ముద్దు పెట్టుకొని చూపుల్నక్కడే వదిలేసి వెళ్లిపోతాయి.

ఆమెతో ఎప్పుడూ మాట్లాడకపోయినా అతనికి రత్నమాల తనని దాదాపు ప్రేమిస్తోందని తెలుసు. ప్రేమను సూచించే చూపులు వేరేవున్నాయి. ఆనవ్వులు వేరేవున్నాయి. ఆభావాలు వేరేవున్నాయి. ఆచేష్టలువేరే వున్నాయి. ఆ"వేరే"ప్రేమ" చూపులూ, నవ్వులూ, ఇలాటివన్నీ రత్న మాల రమ్యంగా సుధాకరంకోసం ప్రదర్శిస్తుంది. అమ్మాయి కనక ధైర్యంగా చెప్పలేక పోయినా ఆమె అతన్నిఅతిగాఢంగా ప్రేమిస్తోంది......... అసంగతి సుధా కరానికీ తెలుసు.

ఇంకా పదకొండు మందో ఎందరో అమ్మాయిలు కూడా అతన్ని ప్రేమిస్తు న్నట్టుగా అతనికి తెలుసు గాని, అతను కూడా రత్నమాలని అంతఅందంగానూ ప్రేమిస్తుండడంవల్ల, రత్నమాలని తల్చు కున్నప్పుడల్లా, చాలాహాయిగా, గర్వంగా మెరిసే రత్నం లాటి భావంఅతని మనసు చుట్టూ మరి వదలనన్నట్టు ముసురు తుంది. అలాజరిగినప్పుడల్లా అతను మన సుని కమ్మేసిన రత్నంలాటి పొరవీడన్ని స్మృతుల ఛాయలో చూస్కొని చాలా సంతోషంగా ఫీలవుతాడు.

ఎప్పుడైనా రత్నమాల నోట్సడుగు తుందేమోనని అన్నినోట్సులూ రెగ్యులర్‌గా రాస్తాడు సుధాకరం. మార్కెట్లో దొరికే మామూలు పుస్తకం దగ్గిర్నించి, 'మార్షల్ ఎకనమిక్స్'దాకా అన్నిపుస్తకాలనీ అతను తనదగ్గరే వుంచుకుంటాడు. ఎందుకంటే ఎప్పుడైనా రత్నమాల ఏపుస్తకమైనా అడుగుతుందేమోనని. కాని రత్నమాల అవేవీ అతన్నెప్పుడూ అడగలేదు. మాట్లాడ లేదు. ఇరవైమూడు సార్లో ఎన్నిసార్లో నవ్వింది. ఒసారితను సరికొత్త మోడల్ షర్టు వేస్కుంటే, ఆషర్టుపక్క అవేళ్ళ




# నోపిన్

మరింత శక్తిమంతమైన
బాధానివారిణి మాత్రమేగాక
మరింత సురక్షితమైనది కూడా!

తలనొప్పి, గుండెజలుబు, మెడపట్టు, ఇంకా అనేక ఇతర రకాల కండరాల బాధలను త్వరితంగా నోపిన్ నివారించగలదు. అధునాతనమై, తేలికగా వాడటానికి వీలుగా వుండేటట్టు ట్యూబ్‌లో నోపిన్ వున్నందున, అంతా అయిపోయేవరకు దాని శక్తి తగ్గకుండా వుండడమేగాక, పారుపోని వీలవుతుంది.

**నోపిన్** తో బాధపోయిందనండి
ఇది శక్తిమంతమైనది

కండరాలనొప్పా? వాడండి
**ఐయోడిమా ఆయింట్‌మెంట్**
శుద్ధగానే బాధ తొలగుతుంది · మరకలుండవు · మంటలే త్వరి

ది కలకత్తా కెమికల్ కం. లి.
కలకత్తా - 29 CLC-4A TE

# దాహం

ఎనిమిదిసార్లో, పదిహేడుసార్లో చూసింది. ఓసారి క్లాసులో ప్రొఫెసర్ గారడిగిన ప్రశ్నకతనుచాలా తెలివిగానూ, కరెక్ట్‌గానూ జవాబుచెప్తే, అతని ప్రక్క మార్షల్ ముని మనవరాల్లాగా చాలా 'ఎప్రిషియేటివ్' గానూ, ఎంకరేజింగ్‌గానూ చూసింది.

అప్పట్నించీ సుధాకరం కేంద్రమంత్రి వర్గం దగ్గిర మొదలెట్టి, ఫెమీనా బ్యూటీ కంటెస్ట్‌మీదుగా వెళ్ళి, ట్విస్ట్ డాన్స్ స్టెప్స్ మీదుగా జారి, చివరికి క్రికెట్ స్కోరుదాకా— అన్నీ కంఠతా పెట్టి, "అమ్మాయిలు అసాధ్యులు గురూ! అప్పడాల దగ్గిర్నించీ అరాచక ప్రభుత్వంవరకూ, వాళ్ళకన్నీ ఇంట్రస్టే. తెలీదని మన్ని అడిగేస్తూంటారుసుమా!" అని అతని కెవరో చెప్పేరు. ఎప్పటికైనా రత్నమాల తనని టెస్ట్ చెయ్యడానికి ప్రయత్నిస్తుందేమోనని చాలా ఆత్రుతగా ఎదురుచూసేడు. కాని రత్నమాల అతన్ని వేవీ అడగలేదు. అందువల్ల అతని నాలెడ్జంతా చెవిటి అమ్మాయి దగ్గిర పాడిన ప్రేమ గీతంలాగ వేస్ట్ అయిపోయింది.

రత్నమాలకోసమే పెంచుకున్న ప్రణయ దృష్టంతా అతని ధైర్యంలేని తనమనే పొర వెనుక చిన్నబోయి, రత్నమాలదయలేనితనం, ప్రేమవున్నా, అప్పైన ఆమె కప్పింపుల వెచ్చదనం అనే గోడ మధ్య ఇరుక్కుపోయింది.

* * *

కాని, ఇన్నాళ్ళ నిస్పృహ తరవాత, పగిలిన మబ్బులోంచి వచ్చని మెరుపులాగ రత్నమాలతో మాట్లాడడానికి, ఆమె మనసు కింకా సన్నిహితుడు కావడానికి, సుధాకరానికి అవకాశం వచ్చింది.

సుధాకరం వెంటనే ఆలస్యం చెయ్యకుండా, రత్నమాల దగ్గిరికివెళ్ళి, నిలబడి "హలో" అనబోయేడు.

కాని, అదే టైముకి రత్నమాల అతని పక్క చూడడంవల్ల, అంతేకాక అతనా కళ్ళలోకి చూడటంవల్ల, అతను—సినిమానీ, ప్రపంచాన్నీ, రత్నమాలనీ, పలకరిద్దామనుకున్న తన ప్రయత్నాన్నీ, అఖరికి తన

దానిన్నీ కూడా మరిచిపోయేడు.

రత్నమాల కళ్లలో మేగ్నెటిజం లాటి మెరుపులున్నాయి. వెలిగిన చంద్రుడి వెనక వెచ్చగా పరుచుకున్న తొలి ప్రణయపు పచ్చని నీడలన్నీ ఆమె చూపులోనే పొంచి, సుధాకరం వైపుమాత్రమే తొంగిచూస్తుంటాయి.

సుధాకరం ఆలోచనలూ, మనసూ—అన్నీ అలాగే వెళ్లిపోవడంవల్ల, అతను అలాగే నిలబడిపోయేడు. అలాగతను ఆ సినిమా ఆడినన్నిరోజులూ వుండిపోగలడు. కాని రత్నమాలమాత్రం సుధాకరాన్నిగుర్తించి "హలో" అంది.

ఒక వంద వీణలు, వెయ్యి గిటార్‌లు, లక్ష సితార్‌లు—ఇవన్నీ కలిసి చాలా అందంగానూ, శ్రావ్యంగానూ పలికించిన ఆ అతి అద్భుతమైన స్వరంవిని, సుధాకరం కొద్ది క్షణాలపాటు బెదిరి.....అన్నీ జ్ఞాపకం తెచ్చుకుని, "హలో" అన్నాడు.


"సినిమాకె వచ్చేరా?" అనడిగింది రత్నమాల.

"మరెక్కడికి? సినిమా హాల్లో కనబడితే, మరి సినిమాకొక్క కథకనుకున్నావా?" అని, మరెవరైనా అడిగుంటే ఆ ప్రశ్నకి సమాధానం చెప్పేవాడే సుధాకరం. కాని.....అడిగింది రత్నమాల.....మరొకరూ మరొకరూకాదు.....రత్నమాల.......అందువల,

"అవునండీ. సినిమాకే. మీరూ సినిమాకేనా?" అన్నాడు సుధాకరం.

"వూ!" అని తలూపి, "అబ్బ! ఏం రష్షండీ ..... నాకు టిక్కట్టు దొరుకుతుందో లేదో తెలీదు.....ఐ డవుట్......అసలే లేడీస్‌కి సెపరేట్ బుక్కింగ్ లేదు కూడాను....." అంది రత్నమాల.

ఏమిటి? రత్నమాలకి టిక్కట్టు లేకపోవడమా? అది సినిమా దురదృష్టం.....రత్నమాలింకా టిక్కెట్టు తీసుకోలేదు. అది తన అదృష్టం. టిక్కెట్టు దొరుకుతుందన్న ఆశ తనకిలేదు. తనక్యూలో వున్నది.... మనిషికి రెండు టిక్కెట్లిస్తారు. చాలు......! వంద టిక్కట్లిచ్చినా తన కక్కరలేదు. రెండే రెండు టిక్కట్లు



'ఆంధ్రపచిత్ర వారపత్రిక'లో ప్రచురణకు ఇండియన్ ఇంక్ తో వేసిన కార్టూనులు మాత్రమే పంపాలి. సాధారణంగా 4'' × 2'', 4'' × 4'' చిత్రాలు పత్రికలో పడుతూ ఉంటాయి. సం॥




ఒకరి శిరోజ సౌందర్యంచూచి మరొకరు ఇక ఎంతమాత్రం అసూయపడవలసిన అవసరం లేదు. రీటా వాడి మీ కురుల సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి.

రీటో కంపెనీ, మద్రాసు 1

R-22 T6




అమర్ కోస్

(రిజిస్టర్డు)

స్వచ్ఛమైన గ్లూకోస్ పొడి. శీతల పానీయాలలో కలిపి త్రాగండి. చక్కెరకు బదులుగా అమర్ కోస్ వాడి చూడండి. ఎంత వ్యత్యాసంవుంటుందో మీకే తెలుస్తుంది. అదనపు పుష్టి నిస్తుంది. యువకులకు, ముసలివాళ్లకు కూడా మంచిది, జబ్బుపడి లేచిన తర్వాత, ఆరోగ్యంగా వున్నపుడు కూడా వాడితే మంచిది. చాలా ఆదాయకరమైనది కూడా.

అమర్ చంద్ శోభాచంద్

మద్రాసు-3.



# దాహం

కోసం తను ఎన్ని ఇక్కట్లెన్నైనా సహించ గలడు. రెండే టిక్కట్లు చాలు. జీవిత మంతటికీ ఈ ఒకే ఒక సినిమా చాలు. సినిమా హాల్లో తను వేయబోయే చాలా జోకులకి రత్నమాల నవ్వబోయే రెండే రెండు నవ్వులు చాలు.....చాలు...."

చెదిరిపోయిన మనసుగల సుధాకరం వెంటనే సర్దుకొని - రత్నమాల టిక్కట్టు కావాలంటే "తప్పకుండా తెస్తాను. విత్ యువర్ ప్లెజంట్ పెర్మిషన్" అన్నాడు. రత్నమాల వెంటనే ఒప్పుకుంది. "ప్లీజ్ వెంటనే వెళ్లండి మరి. ఫస్ట్ సాంగ్ మిస్సవులే లాభంలేదు.రఫీ సాంగండీ! మార్వలస్ సాంగ్... వెళ్లండి సుధాకరంగారూ.....వెళ్లండి మరి" అందామె చాలా కంగారుగానూ, అందం గానూ.

"తెస్తాను. ఇదిగో వెళతాను. కాని నాదో చిన్న రిక్వస్ట్. నాకు చాలా దాహంగా వుంది. అందువల్ల మీరు డ్రింకోటి తీసు కోవాలి" అన్నాడు సుధాకరం జోరుగా.

అప్పుడు దోసెడు రత్నాలని గజం ఎత్తునుంచి గలగలా ఒంపినట్టు రత్న మాల నవ్వింది.

ఆ నవ్వు చూడగానే సుధాకరం చాలా గాభరా పడ్డాడు. అదికాక అతనికో కొత్త విషయం తెలిసింది. రత్నమాలకి పైవరసలో. నవ్వినప్పుడు కనబడే నాలుగో పన్ను కాబోలు లేదు. (ఎప్పుడైనా రత్న మాల మరీ అందంగా నవ్వినప్పుడు రత్నంలా రాలిపోయిందేమో!) ఆమె అంత అందం గానూ, అంత జోరుగానూ, అంత విండు గానూ నవ్వినప్పుడు ఆ పన్నులేనితనం స్పష్టంగా తెలిసింది. ఆమె అలా నవ్వు తూంటే ఆ పన్ను లేకపోవడంవల్ల చాలా అందం — ఆ పన్ను వుండివున్నా ఉండని అందం. ఆ నవ్వుతోబాటు నవ్విందని!...ఆ పన్ను లేకపోయినా ఆ నవ్వు, పదో, పన్నెండో రత్నాలుపేర్చి, మధ్యలో వో రత్నపుమేరకు ఖాళీ వదిలేసినట్లు చాలా బావుంది. సగం చంద్రుడువుండి, సగం చంద్రుడు మాయమైపోయినా సగంలేని చంద్రుడు కూడా చాలా అందంగా వున్నట్టు, ఒక పన్ను లేకపోయినా రత్నమాల నవ్వు చాలా అందంగావుంది.

ఆ నవ్వునిచూసేక, సుధాకరం తన్నెవరో మేఘాలమీదికి తీసుకువెళ్లి, మెరుపులమధ్య పడవేసినట్టూ, ఆ మెరుపులమధ్య తనూ వో మెరుపై మెరిసి మళ్లీ ఒక్కసారి ఉల్కలా భూమ్మీదకు జారిపోయినట్టూ ఫీలయేడు.

రత్నమాల నవ్వాపేసి, "పదండి"అంది. ఇంతకూ ఆమె ఎందుకు నవ్విందో సుధాకరానికి అర్థంకాలేదు....తను క్రాఫింగు దువ్వుకోడం మరిచిపోయేడా? లేక జుత్తు చెరిగిపోయిందా? ఊహు! అయ్యుండదు. తన జుత్తు చెరిగిపోయినా బావుంటుందని బి. ఏ. లో ఉన్నప్పుడు పద్మిని కాబోలు చెప్పింది. ఆ రోజుల్లో ఆమె తన జుత్తు అదెవరో హీరో జుత్తులాగే ఉంటుందని క్లాసమ్మాయిలందరి తరఫునా తురుపు కొట్టినట్టు వొక్కిచెప్పింది....మరేమిటై ఉంటుంది?......పోనీ అడిగితే.....

కేంటిన్ దగ్గిర డ్రింకు సగం తాగి, "ఏవండీ! ఇందాక ఎందుకలా నవ్వేరు?" అనడిగేడు సుధాకరం.

రత్నమాల అతనిపక్క చాలా క్యూరియస్గా చూసింది. "ఫీలయ్యేరేంటి కొంప తీసి? సారీ.....ఏంలేదు....మీకు దాహం వేస్తే నేను డ్రింకు తాగడమేవిటండీ?" అంది. అని, ఆగి, వో నాలుగు సెకెండ్లు మళ్లీ లేని నాలుగోపన్ను కనబడేటట్టు హాజాగ్గా, నవ్వి, "సినిమా టిక్కట్టుకోసం క్యూలో నిలబడి ఇంత అలిసిపోయేరు కదా! రేప్పొద్దున్న యుద్ధానికి వెడితే ఏం చేస్తారూ? అని. అప్పుడు మీ డ్రింక్ త్రాగ డానికి కంపెనీ ఎవరొస్తారూ అని." అంది.

రత్నమాల జోకు వేసింది కనక సుధాకరం నవ్వేడు. నవ్వి, డ్రింకు తాగడం పూర్తి చేసి తన బాటిల్ కేంటిన్ లోపలికిచ్చేసి, రత్నమాల డ్రింకుతాగేయగానే ఆ బాటిల్ అందుకోడానికి చెయ్యి జాచేడు. అప్పుడు చల్లని డ్రింకుబాటిల్తోబాటు, రత్నమాల చేతివ్రేళ్లు కూడా చల్లగా, హాయిగా అతని చేతివేళ్ళకి తగిలేయి. రత్నమాలకంగారు

పడలేదు. తన చేతినలాగేవుంచి సుధాకరం పక్క సూటిగా చూసింది. సుధాకరం చాలా కంగారుపడ్డాడు. ఎందుకోగాని, ఆమె చేతిలో తన చెయ్యి చిక్కుకొని, బిగుసుకున్నట్టు ఫీలై వెంటనే బోటిల్‌ని ఆమె చేతి లోంచి తీసుకొని కేంటిన్ వాళ్ల కిచ్చేసేడు. "నేనిస్తాను" అని హేండ్‌బ్యాగ్ లోంచి డబ్బుతీయబోయిన రత్నమాలని వారించి, తనే డబ్బిచ్చేసేడు. అప్పుడెందుకో గాని, రత్నమాల హేండ్‌బ్యాగ్‌లోంచి తీసిన తన చేతివైపు చూస్కోడం, తిరిగి సుధాకరం చేతివేపుకూడా చూసి, నిట్టూర్చడం అతను గమనించలేదు. కాని అతనంత త్వరగా డ్రింక్ బాటిల్ తీసుకోడం, ఆమె చేతిని వదిలేయడంవల్ల, ఆమె కొంచెం విసుక్కుని, విచారంగా ఫీలైంది.

ఇంతలోనే "చూసేరా? లైనైపోయింది. నేను వెళ్లి టిక్కట్లు తీస్కొస్తాను" అని ఆమెకి మాట్లాడ్డానికి కూడా అవకాశం ఇవ్వకుండా సుధాకరం వెనక్కి తిరిగేడు.

"ప్లీజ్. ఐల్ బి వెయిటింగ్ ఫర్ యూ" అంటూ అతని ముందుకొచ్చి ఐదు రూపాయల నోటివ్వబోయింది. రత్నమాల. "నో నో! ప్లీజ్ వెయిట్" అని మాత్రమే చెప్పి, ఆమె చూపులవెనకదాగున్న అతి సొగసైన భావాలని తీసుకొని, ఐదు రూపాయల నోటు నామె చేతిలోనే వదిలేసి గబ గబా క్యూ దగ్గిరకి నడిచేడు సుధాకరం.

జోరుగానూ, ఆత్రుతగానూ వెళ్లి క్యూలోని తనచోటులో నిలబడబోయేడు. కాని "సార్ (మేడం!) ప్రేమకీ భువిలో అన్నీ ఆటంకాలే. పచ్చగా ప్రేమతో వెలుగుతున్న అబ్బాయిని చూస్తే అందరికీ జెలసీవే. అందరి చూపులూ, విషపు చూపులుగామారి, (ఎవరో, మీలాంటి ఎక్సెప్షన్స్‌ని తప్ప) చొచ్చుకొని గుచ్చుకుంటాయి.

అందువల్లే ఇందాక సుధాకరం ముందునున్నాయన— "మీ ప్లేసులేదు. ఎగిరిపోయింది" అన్నాడు.

"ఏం! నేనుదాహంవేస్తే అలావెళ్లేను. చెప్పి వెళ్లేనుగా. ఈ ప్లేసునాదే. నావెనకనున్నాయన్ని అడగండి" అని వెనక్కిచూసేడు సుధాకరం. వెనుక నుంచున్న ఇందాకటాయన ఇప్పుడు అక్కడలేదు. ఓపిక తోబాటు చచ్చిపోయి ఎప్పుడో వెళ్లిపోయుంటాడు.

"మీదేంటేమిటి? తెలీకడుగుతాను, రిజిస్ట్రేషను చేయించేరా? బావుందండోయ్! మధ్యలోవెళ్లి, మేమూ షికారుకొట్టి, అమ్మాయిల్తో డ్రింకులు తాగగలం ఒళ్లు తెలీకుండావుంటే. ఇదేం సినీమాహాలా, ఇల్లా? వెళ్లండి! అయ్యా వెళ్లండి మరి.." అన్నాడు హిట్లర్‌మీసం ఒగరుస్తూ.

అప్పుడు సుధాకరం కోపంతో ఇందాకటి డ్రింకులా పొంగేడు. తనతోబాటు వాడు రత్నమాలని కూడా అలా అనడంతో చాలా కోపంవచ్చి, "మర్యాదగా మాట్లాడవయ్యా. బి హేవ్ యువర్ సెల్ఫ్" అన్నాడు.

అమాట వినగానే హిట్లర్ మీసం "ఓస్! చాల్చాల్లేవయ్యా! నాలుగు ఇంగ్లీసు ముక్కలు పేలగానే సరా! ఉన్నమాటంటే కోపం ఒకటా.....వెళ్లెళ్లు... మళ్లీ మాట్లాడకు....చాలా మందిన్చూసేను కాని, మరి మాట్లాడకుండా వెళ్లు..... మరో డ్రింకుతాగి, ఇంటి కెళ్లి బజ్జో" అన్నాడు. అని, చాలా విట్టీగా మాట్లాడేననుకొని అందరిపక్కాచూసి, సగర్వంగా నవ్వేడు.

అప్పటికే చాలామంది ఇటే చూస్తున్నారు. వాళ్లలో హిట్లర్‌మీసం బ్రాండుగాళ్లు సుధాకరం పక్క వెటకారంగాచూసి నవ్వేరు.

ఆ వెంటనే సుధాకరానికి చాలా ఆవేశం ఇందాకటికోపంతోబాటు కలిసి, పెరిగింది. అతను కోపంగా, చాలాకోపంగా చెయ్యెత్తి హిట్లర్‌మీసం దవడమీద ఒక్కదెబ్బ కొట్టబోయేడు.

అప్పటికే బుకింగ్ ఓపెన్ చేసేరు. జనం ముందుకు వెళుతున్నారు. ఐనా చాలా మందికి క్యూలో సినీమాలే వచ్చడంవల్ల ఇటే చాలా ఆసక్తిగా చూస్తున్నారు. క్యూలో లేని పైవాళ్లూ, మిగతా టిక్కెట్లవాళ్లూకూడా "ఈ ఎంటర్‌టెయిన్‌మెంటు బావుంద"ని ఇటేచూసి, ఇక్కడికే రావడం మొదలెట్టేరు.

హిట్లర్ మీసానికి కూడా కోపంవచ్చి అతనూ చెయ్యెత్తాడు.

కాని, ఇంతలోనే అతి సడన్‌గానూ, అతి వేగంగానూ, ఎవరిమీదా దెబ్బలు పడకుండానే హాలు మేనేజరుగారు అక్కడ ప్రత్యక్షమయేరు. అంచు, వాళ్లిద్దరికీ సర్ది చెప్పి, సుధాకరంతో స్పెషల్‌గా ఎవరూ వినకుండా పక్కకి తీసుకువెళ్లి, "అదేంటి సార్! ఆయనో, మీకేమిటి? చదువుకున్నవారుకదాసార్! ప్లీజ్ డోంట్ బీ ఇరిటేటెడ్" అని చాలా చల్లగా, డ్రింకుబుడ్డీ అంత చల్లగా చెప్పేరు.

ఆ తరవాత హిట్లర్ మీసానికికూడా "వాళ్లు స్టూడెంట్సు కదాసార్! వాళ్లతో మనకి తగువెందుకు చెప్పండి. వాళ్లసలే కోపంవస్తే మంచివాళ్లుకారు. ఏదైనా గొడవైతే మీకూ, మా కొత్త హాలుకీ కూడా డేమేజి తప్పదు. అందువల్ల నా మాట విని దయవుంచి వూరుకోండీ" అని చెప్పేక, సుధాకరానికి తిరిగి క్యూలో పాత ప్లేసిప్పించి నిష్క్రమించేరు మేనేజరుగారు.

"హు! ఎవరికోసం? రత్నమాల సినీమాకివస్తే, ఎవరికోసం ప్లేసిప్పిస్తారు? నన్నూ, రత్నమాలనీ మరెవ్వరూ విడదీయలేరుగాక విడదీయలేరు" అని ఇంకా ఆవేశంగానూ, అందంగా చాలా అనుకున్నాడు సుధాకరం. చాలా ధైర్యంగా, అందరు శత్రువుల్నీ చంపేసిన అరివీర భయంకరుడిలాగ కదలడం ప్రారంభించేడు.

క్యూతోబాటు కదుల్తూ అతను రత్నమాల పక్క చూసూనే ఉన్నాడు. రత్నమాలా, అతని పక్క చాలా అందంగా ఎప్రీషియేటివ్‌గా చూస్తూనేవుంది.

తనపక్కసీట్లో కూచోబోయే రత్నమాలనీ, తననీ, తన ప్రేమకు మొదటిమెట్టుగా తామిద్దరూ కలిసి ఎక్కబోయే బాల్కనీ తలుచుకుంటూ ముందుకు కదులుతున్నాడతను. అప్పు డతనిలో చాలా అందమైన

ఆలోచనలు అదుపు లేకుండా అలుము కుంటున్నాయి.

"రత్నమాలలేని నా జీవితంలో ఇప్పటి దాకా, రత్నంలాటి కొత్త వెలుగు లేనేలేదు.... ఇన్నాళ్ళకి, ఈ చల్లని స్మృతినీడలో నియంతలా సంచరించి, కడుపునిండా తిని పరుపు నిండా పడుక్కుంటాను. అనురాగపు చరిత్రలో మాపేర్లను రత్నాక్షరాలతోరాస్తారు" అని అనుకున్నా డతను. ఇంకా చాలా అనుకోబోయేలోపున హిట్లర్‌మీసం టిక్కట్టు తీసుకుని పక్కకి వెళ్ళిపోయేడు.

అందంగా వణుకుతున్న గుండెల్తో, జేబులోంచి .పది రూపాయల నోటుతీసి కౌంటర్‌లో పెట్టి, "టూ టిక్కెట్స్ ప్లీజ్" అన్నాడు సుధాకరం. అని అక్కణ్ణించే రత్నమాలపక్క మళ్ళీచూసేడు. కేంటిన్ దగ్గిర నిలబడి తన పక్క చూస్తున్న రత్నమాల, తన పక్కనే కూర్చోబోయే రత్నమాల చాలా అందంగా కనబడుతోంది. ఎవరెస్ట్ ఎక్కుతున్న పర్వతయోధుడికి సగం దూరంనించి మంచుకొండ మధ్యభాగం కనిపించినట్టు, రత్నమాల సుధాకరం కళ్ళకి తెల్లచీరలో మంచుకొండలాగే చాలా మనోహరంగా కనిపించింది. అత సదృష్టంలాగే చాలా అందంగావుంది. ఎన్నో కష్టాలనుభవించేక స్వయంవరంలో వరించబోయే రాజకుమారుణ్ణి రాజకుమారి పదడుగుల దూరంనించి చూసి నవ్వినట్టు నవ్వుతోంది.

సెవక మున్నాయున తొందర చేయడంతో బుక్కింగ్‌లోకి చూసేడు సుధాకరం. అతని పక్కే చూస్తున్న బుకింగ్ క్లర్కు, "సారీ సార్! టిక్కెట్స్ ఆర్ ఓవర్" అన్నాడు.

సుధాకరానికి మొదట-అర్థమవలేదు. అత న్నిర్మించుకున్న రత్నాలమేడ దిగేసరికి అతనికి చాలాసేపుపట్టివుంది. అర్థమయేక పక్కకి తిరిగి పైకి వచ్చేసేడు. దగ్గర్లోనే హిట్లర్ మీసం నిలబడి మీసం దువ్వుకుంటున్నాడు. ఆ సమయంలో హిట్లర్ మీసం సుధాకరానికి హిడింబి తమ్ముళ్లా కనబడ్డాడు. చాలా సిగ్గు, విచారం వేసినా 'అతనికేం చెయ్యాలో తోచలేదు.

అతని గుండెల్లోపలి తియ్యనిభావాలన్నిటినీ ఎవరో నిస్పృహ, నిరాశలతో లోషన్‌లు వేసి కడిగేస్తున్నారు.

మళ్ళీ ఎందుకోగాని విపరీతమైనదాహం వేసి, గొంతుక పట్టుకున్నాడు సుధాకరం.

ఏంచెయ్యాలో తోచక రత్నమాలపక్క చూడలేనట్టు చూసే డతను.

రత్నమాల ఇందాకటిలాగే తెల్లని టెర్లిన్ చీరలో, రమ్యమైన రత్నంలా మెరుస్తూ— చాలా అందంగా రత్నాలుపేర్చి, మధ్యలో ఒక రత్నం మరిచిపోయినట్టు నవ్వుతోంది.


దివ్యమైన పరిమళం

ప్రియ

మనోహరమైన ప్రియ సుగంధము మిమ్ము స్వప్నసౌధాలచేర్చును. మిమ్ము దినమంతా నవకుసుమ సౌరభవముతో ఉల్లాసముగా నుంచును.




బెంగాల్ కెమికల్

కలకత్తా * బొంబాయి * కాన్పూరు * ఢిల్లీ.

ఓం! తత్! సత్!



సుఖ జీవిత సేవ

"సిద్ధవైద్య మహిమ"

సిద్ధుల సాటిలేని కీర్తికి ఒక తార్కాణము

కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారి గారి

'మేల్ మాయిల్ మందు'

(Regd)

దీర్ఘకాల చర్మరోగములకు చక్కని నివారిణి

నల్లరంగు, ఎర్రరంగు పొడలు, దద్దులు, పోట్లు, గజ్జి (చర్మ సంబంధము) పొడలు గల చోట్లలో తిముర్లు, సూదితో పొడిచినప్పుడు నొప్పి లేకుండుట, నిప్పపడి బొబ్బలు గలిగినా తెలియకుండుట, దుర్‌నీరు నర, అవయవములందు వ్యాపించి, రక్తములో కలిసి మత్తు కలుగజేయుట, (నరముల సంబంధము) చేతి వ్రేళ్ళు ముడుచుకొనుట, బొబ్బలు లేచుట, ముక్కు బంధనములు, పాదము నందు వల్లపు పుండ్లు ఏర్పడుట, కాలుచేతులు (వ్రేళ్ళు) తగ్గుట, ముక్కు సొట్టపడుట, చూచుటకు వినుగు పుట్టించు రణములు (అస్థి సంబంధము) వీటికి చక్కని నివారిణి.

**1 మండలం (40 రోజులు) నూనె, లేహ్యము రు. 8–50 తపాల ఖర్చు రు. 2/-**

**8 ఔన్సుల శ్రీ పరమాత్మ తైలం రు. 3–50 తపాల ఖర్చు రు. 1–50**

సిద్ధ డాక్టర్

కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారి & సన్సు

*5/22, మేల్ మాయిల్ P.O, (N.A Dt.)*